# గడచిన దినాలు

చితక తన్నాడు మా అమ్మని—

నేను పుట్టకపూర్వం మా నాన్నకు వున్న చొక్కా ఒక్కటే. మణికట్టుదాకా బారు చేతులు, కంఠిమెడ, పొరుగూరెళ్ళాలంటే ఆ చొక్కా తొడుక్కునే వాడు. అది మాసిపోయినా మా అమ్మ వుతకెయ్యలేదు. "నే నివాళ పొరుగూరెళ్తానంటే యెందు కుతకెయ్యలేదు. నా దరిద్రం లోకానికి చాటాలనా ?" అని వళ్ళిరిగేట్టు తన్నాడు మా అమ్మని...

మా అమ్మ కుయ్‌మనలేదు.

మా అమ్మ మామంచి మనిషి, నన్ను కళ్ళల్లో పెట్టుకునేది. మానాన్న గూడ మంచివాడే. ఆయన సరుకు కొమ్మ పట్టుకుని కొడుతుండే వాడన్న మాటేగాని, కొట్టేంతర్వాత వాడి మంచికి వాణ్నే కొట్టాల్నొచ్చింది అని మడతమంచం మీద పడుకుని, పై పంచ కప్పుకుని, ఎక్కెక్కి యేడ్చేవాడు.

నన్నే కాదు; మా అమ్మనిగూడ కొట్టేవాడు మా నాన్న. కోపమొస్తే మనిషికాదు ఆయన. అదేం ఖర్మమో కోపం వారాని కోసారైనా తప్పకుండా వస్తూండేది—!

అప్పటికి నేను పుట్టలేదు. అప్పుడే కొత్తగా పెళ్ళయింది మా అమ్మకు. పెళ్ళయింతర్వాత మా అమ్మయ్యాక,

మా నానయ్యకీ తగాదా వచ్చింది. వాళ్ళిద్దరిమధ్యా పచ్చ గడ్డివేస్తే భగ్గున మండేది. ఆ యింటిమీద కాకి యీ యింటి మీద వాలేదికాదు.

అయినా మా అమ్మ కాపురానికి వచ్చింది. మా అమ్మయ్య మాట వినకుండా వచ్చింది. 'అమ్మా! వాళ్ళు మనుషులు కాదే. నువ్వెళ్తే చంపుకుతింటారే!' అన్నాడు మా అమ్మయ్య.

మా అమ్మ వినలేదు. 'ఇదంతా యిచ్చేప్పు డెందుకు ఆలోచించలేదే అయ్యా. నరకమైనా అదే గతి, స్వర్గమైనా అదేదారి' అన్నది మాఅమ్మ. అప్పటికి మా అమ్మకి కాపుర మంటే యేమిటో తెలియదు. ఆవిడ భయమంతా "లోకం ఏమంటుందో!" అని. కట్టుగుడ్డతో బయలుదేరి వచ్చేసింది అత్తింటికి.

మా అమ్మయ్యగారి పార్టీ పెద్ద పార్టీ. మాఅమ్మయ్యకి కోపంవస్తే ముందూ వెనకా తెలిసేదిగాదు. మా నానయ్యకి మా అమ్మయ్యంటే హడల్ —!

ఆ కోపం యీ కోపం మా అమ్మమీదికి దిగింది.

అప్పటికి నేను పుట్టలేదు. మా నాన్నయ్యా యింటికీ గొడ్డసావిడికీ రెండువందల బారల దూరం. మా అమ్మ పచ్చ గడ్డి పనలు యిక్కణ్నుంచి అక్కడికి జేరేసేది. వర్షాకాలంలో వర్షం కురిసేది; మోకాల్లోతు కయ్యా. మగాళ్ళుకూడా యమ యాతనలు పడేవారు. పద్ధెనిమిదేళ్ళు దాటకపోయినా మా

అమ్మ జడేసుకున్న పాపాన పోలేదు. ముసలివాళ్ళకి మల్లే కొప్పు పెట్టుకొని ముచ్చట ముడి వేసుకునో, చెంగులు మోకాళ్ళపైకి దోపుకుని పచ్చకడ్డీపనలు వాటేసుకుని, కొప్పు జారిపోతున్నా, ముచ్చటముడి వూడిపోతున్నా చూడకుండా ఝుయ్‌న వానకురుస్తున్నా లక్ష్యపెట్టకుండా మోకాల్లోతు కయ్యలో గొడ్లచావిడికి బయలుదేరేది. ఈలోపుగా కర్రిగిత్త "అంబా!" అని అరిచిందంటే మా అమ్మ గుండెలు బెదిరి పోయేవి. కర్రిగిత్త అరుపు మా నాన్న చెవినిపడితే మా అమ్మ వీపు చిట్లిందన్నమాటే—

నేను పుట్టక పూర్వం మా నాన్నకి వున్న చొక్కా—వొక్కటే. మణికట్టుదాకా బారుచేతులు,కంటిమెడ. పొరుగూ రెళ్ళాలంటే ఆ చొక్కా తొడుక్కునేవాడు. అది మాసి పోతే మా అమ్మ వుతకేసింది. నేనివాళ పొరుగూరెళ్తానంటే యెందుకుతికేశావ్? నా దరిద్రం లోకానికి చాటాలనా? అని చితకతన్నాడు మా అమ్మని...

మా అమ్మ కుయ్‌మనలేదు. మా అమ్మే చాలా మంచిది. మా అమ్మకి భూదేవికున్నంత వోర్పుంది.

మాణిక్యం అక్కాయి చెబుతూనే వుంది. మాఅమ్మకి కోపం లేదు; తాపంలేదు. మా నాన్న వారానికొకసారైనా కొడుతూండేవాడు. మా నాన్న రోజుకొకసారైనా గడ్డి మోపులు కట్టుకొస్తూండేవాడు. నల్లగా నెత్తిమీద మోపు పెట్టుకొస్తూంటే మనిషిని చూసీచూడ్డంతోనే మా అమ్మ ఇంట్లోకి పరుగెత్తేది. కంచు గ్లాసు కళాయిలో ముంచేది,

నిండిన గ్లాసు చేత్తో పట్టుకుని వాకిట్లో నుంచునేది. పురి ప్రక్కన మోపు పడేసి గ్లాసు లాక్కుని గటగటా త్రాగేసి అరుగుమీద కూలబడేవాడు మా నాన్న. మా అమ్మ మోపు విప్పి గేదెలకీ, ఆవులికీ పంచిపెట్టేది.

మా అమ్మకి సుఖమంటే యేమిటో తెలియదు. వర్షా కాలం అనకుండా వేసవికాలం అనకుండా, ఇంట్లో కావలసిన నీళ్ళన్నీ జేరేసేది. మా నాన్న రావిచెట్టు గట్టుమీద పైపంచి పరిచి పడుకునేవాడు. మా అమ్మ శక్తిబిందీ కడవబిందీ చెరో చేతినా పట్టుకునేది. చెరువు రేవులో దిగేది. తోడన్నా లేకుండా మోసుకొచ్చేది. చూచేవాళ్లు మా అమ్మ గూళ్లు జారిపోతాయి, అనుకునేవాళ్ళు. అట్లా పధ్నాలుగేళ్ళు మోసింది. మా నాన్న చూశాడు. మా నాన్న పెదవి కదప లేదు. మా అమ్మ ఉస్సురనలేదు. మా అమ్మ గూళ్ళు జారి పోలేదు.

మా అమ్మ గడప దాటి యెరుగదు. ఊళ్లో తోలు బొమ్మలాడినా చూచేది కాదు. యానాదులు భాగవతం ఆడినా వెళ్లేదికాదు. అయినా ఊళ్లోవాళ్ళందరూ మాఅమ్మని 'అక్కాయి' అని పిలిచేవాళ్ళు. "ఆడదంటే ఆవిడా!" అని మెచ్చుకునేవాళ్ళు. మా అమ్మ అంటే అందరికీ ఎంతో గౌర వం; యెంతో అభిమానం. కొత్తగా పెళ్ళయిన జానికమ్మా, రాజమ్మా, మహలక్ష్మి వచ్చి కష్ట సుఖాలు మా అమ్మతో చెప్పుకునేవాళ్ళు.

అప్పటికి నాకు 'ఊహ' వచ్చింది. మా అమ్మ వాళ్ళకి

సాంత్వన ఇచ్చేది. "వీళ్ళ నాన్న" ఇట్లా ఇట్లా చేసేవారు, అని నా వంక చూసేది. "మీ కేనే పెట్టి పుట్టారు. మీరు నోచిన నోములు నేనెక్కడ నోచానే" అనేది. వాళ్లు నవ్వేవాళ్లు. నేను చిన్నవాణ్ణనుకుని మా ఆయన ఇట్లా అన్నాడనీ, అట్లా చేసాడనీ మా అమ్మతో చెప్పేవాళ్ళు. మా అమ్మ నవ్వేది. తన అనుభవాలు చెప్పేది "అదేం మనిషమ్మా" అనేవాళ్ళు వాళ్ళు. నాకు నవ్వొచ్చేది కాదు. ఏడుపొచ్చేది. ఏడ్చే వాణ్ణి, జానికమ్మ, రాజమ్మ, మహాలక్ష్మి నావంక దీనంగా చూచేవారు. 'నువ్వెక్కడున్నావురా' అన్నట్లుగా చూసే వాళ్ళు. మా అమ్మ మళ్ళీ నవ్వేది. మా అమ్మ నవ్వితే మల్లి పూలు కన్పించేవి కాదు; మువ్వలు మోగేవి కాదు. శవాలు కదిలినట్లుండేది. శ్మశానం లేచినట్లుండేది. కుండలు పగిలినట్లుండేది. "అవన్నీ ఇప్పటి సంగతులు కాదు బాబూ. ఇప్పుడు మీ నాన్నగారి కేం? మహారాజులు!" అనేది, అని వీపు నిమిరేది. మా అమ్మ వీపు నిమిరితే నాకు నిద్ర వచ్చినట్లుండేది. ఆ మగతలో మా నాన్న తాటికమ్మ పుచ్చుకుని ప్రత్యక్షమయ్యేవాడు. నేను నిద్రపోయేవాడిని.

ఒకనాడు మా నాన్న పొలంనుంచి ఇంటికి వచ్చేప్పటికి ప్రొద్దుపోయింది. ఆ పూట అన్నంలో పలుకుందట. మా నాన్నకి కోపం వచ్చింది. మా నాన్న రుద్రుడయ్యాడు. నాకింకా బాగా జ్ఞాపకం. మా నాన్న ముఖంమీద పేలాలు వేగినయి. అన్నప్పళ్ళెం దీసి గిరాటు వేశాడు. పళ్లెం వెళ్ళి పెంటపోగులో పడింది. మానాన్న అయిదువేళ్ళూ అట్టపుల్లల్లా తేలినయి మా అమ్మ దవడమీద.

"నీతో కాపరం చెయ్యలేను ఫో"అన్నాడు మా నాన్న.

"ఈ పిల్లలో" అంది మా అమ్మ. అప్పుడు మా అమ్మ నా వంక చూచింది. చెల్లివంక చూచింది. చచ్చిపోతూన్న మా గేద్దూడవంక మా అమ్మమ్మపడ్డ చూచినట్లు చూచింది మా అమ్మ. నాకు యేడుపొచ్చింది.

"ఈ యింట్లో వుంటానికి వీల్లేదు ఫో" అన్నాడు మా నాన్న.

ముంజెయ్యి పట్టుకుని గబ గబా యీడ్చాడు; గుమ్మం బయటికి యీడ్చాడు. వాకిట్లోకి యీడ్చాడు, మా అమ్మ నదరలేదు, బెదరలేదు.

"ఇక యీ గడప తొక్కా—నంటే వొట్టు!"అన్నది మా అమ్మ. "ఈ బిడ్డల ముఖం చూసిగాని... లేకపోతేనా" అంది మా అమ్మ.

మా నాన్న వినిపించుకోలేదు. తలుపు లోపల గడియ వేసుకున్నాడు.

మా అమ్మ చెరువు గట్టుకి వెళ్ళుంటుంది. చెరువులో తామరాకులు, తామర పువ్వులు, తామర మొగ్గలు, ఒడ్డున కాచే వెన్నెల చూసివుంటుంది. మా అమ్మ యేమనుకుందో యేమో!

చెరువులో దూకలేదు. కొంగుతో కుత్తుక బిగించుకోలేదు.

మా అమ్మ తిరిగి వచ్చింది. గొళ్లెం కటకటలాడింది. గొళ్లెం చల్లగా వుండి వుంటుంది. శాలువ కప్పుకొని మడత మంచంమీద పడుకొని వెక్కెక్కి ఏడుస్తూన్న మా నాన్న కదిలాడు. మడత మంచం పట్టా కిర్రుమంది. తలుపు గడియ కదల్లేదు.

కిటికీలో ముఖంపెట్టి "తలుపు తెరవరూ?" అంది మా అమ్మ.

మా నాన్న కదల్లేదు. నేను కదిలేను.

మా అమ్మ లోపలికొచ్చింది. మడతమంచం మూలగ లేదు; గాండ్రుమంది. మా అమ్మ కెవ్వుమంది.

మర్నాడు ప్రొద్దున మా నాన్న నాచేతిలో కానీ పెట్టాడు.

"శనగపప్పు కొనుక్కో" అన్నాడు.

నా కేడుపొచ్చింది. ఇంతవరకెప్పుడూ మా నాన్న కాండబ్బిచ్చిన పాపాన పోలేదు. మా నాన్నగూడా మనిషే. మా నాన్నకీ ప్రేముంది; బిడ్డలంటే గారాబం వుంది.

మర్నాడు మా ఇల్లంతా యేడ్చింది. మా తాత (అమ్మయ్య) యేడ్చాడు. మా అమ్మమ్మ యేడ్చింది. మా అమ్మేడ్చింది. మా చెల్లి గుక్కపట్టింది. మా మేనత్త చీదింది.

మర్నాడు పోస్టు బంట్రోతు వుత్తరం తెచ్చాడు. మా మామయ్య బిగ్గరగా చదివాడు. అది మా నాన్న వ్రాసిన

వుత్తరం. మా అమ్మ సాక్షాత్తు పతివ్రత. సావిత్రిలాంటిది. సీతమ్మవారిలాంటిది. చంద్రమతి వంటిది. అన్నె మూపున్నె మా ఏమీ ఎరగదు. అదంతా మా నాన్నదే తప్పు. ఏముఖం పెట్టుకుని వూళ్లోకొస్తాడు? మా అమ్మని హింసించాడు. బాదాడు. ఇక రాలేదు. యెరిగినవాళ్ళ ముఖం చూడలేదు. ఇందుట్లో మాఅమ్మ తప్పేమీ లేదు. అంతా తనదే తప్పు. మా అమ్మ ముఖం చూచేందుకు గూడా అర్హుడుగాదు మా నాన్న.

ఉత్తరం విన్న తర్వాత వెంకమ్మత్త అంది గదా "పాపం! కాకులు మసకలాడేప్పుడు రాయించాడల్లే వుందే ఆ వుత్తరం!" మా వాళ్ళందరూ వొప్పుకున్నారు, లేకపోతే అదేం వుత్తరం?

మా అమ్మ కుళ్ళింది; కుళ్ళి కుళ్ళి యేడ్చింది. కూడు తినలేదు; నీళ్ళు ముట్టలేదు. మా నాన్నంత మంచివాడు లేడు; మా అమ్మంత గొప్పది లేదు.

మా నాన్న మళ్ళీ వచ్చాడు; పదిహేనురోజుల్తర్వాత. ఇంతా నడిస్తే గుడివాడనుంచి బయల్దేరినవాడు బెజవాడ దాటలేదు. ఊళ్లో వాళ్లందరూ "దేశాంతరం వెళ్ళినాయన వచ్చాడే!" అన్నారు.

ఆవాళ కొత్త కోక కట్టుకుంది మా అమ్మ. మట్టెలూ, పట్టాలూ పెట్టుకుంది. నూనె రాసుకుంది, తల దువ్వుకుంది; కళ్ళకు కాటుక పెట్టుకుంది.

చెరువు గట్టుమీద తుమ్మచెట్టు వెనకాల పొద్దు గూకింది; కుక్కలు మొరిగినయి. మావాకిట్లో మంచాలమీద మేం పడుకున్నాం.

మా నాన్న మడత మంచం సకిలించింది. "ఇంకా పిల్లలు నిద్రపోలేదు!" అన్నది మాఅమ్మ.

నేను ఊపిరి బిగబట్టాను.

—::—